www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 జులై 2023 5 తూర్పుగోదావరి



గోతులమయంగా చాగల్లు బస్టాండ్ రోడ్డు

ప్రజాశక్తి-చాగల్లు

పంగిడి నుంచి నిడదవోలు వైపుకు వెళ్లి ఆర్ అండ్ బి రోడ్డు వేసి నాలుగేళ్లు కావడంతో చాలాచోట్ల గోతులు పడి ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. చాగల్లు బస్టాండ్ వద్ద వరద నీరు ఏ పక్క వెళ్లలేక చెరువు తలపించేలా గోతులు పడి ద్విచక్ర వాహనదారులకు ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ప్రమాదం జరగకుండా ముందే బస్టాండ్ వద్ద గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



చాగల్లు బస్టాండ్ రోడ్డు

సాగు బాటలో రైతాంగం

- జోరుగా వ్యవసాయ పనులు
- జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో పంటల సాగు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మొన్నటి వరకు వర్షాలు లేక దిగాలు పడిన రైతులు ఉత్సాహంతో పొలాల్లోకి దిగారు. జిల్లాలోని అన్ని మండలాల్లో జోరుగా వరి నాట్లు సాగుతున్నాయి. జూన్‌లో వర్షాలు ముఖం చాటేసినా తాజాగా వర్షాలు పడడంతో చెరువులు, కుంటల్లోకి పుష్కలంగా నీరు వచ్చి చేరింది. జిల్లాలోని దాదాపు చిన్న, పెద్ద చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. కొన్ని మండలాల్లో వర్షాలు ఆగడంతో రైతులు నాట్లు వేయడానికి నడుం బిగించారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా పొలాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు నాట్లు వేస్తూ, సాగుకు భూమిని సిద్ధం చేస్తూ కనిపిస్తున్నారు. ఆరుతడి పంటలకు ఇబ్బంది లేకుండా పోవడంతో అన్నదాతలు నిబ్బరంగా పొలం పనుల్లో మునిగిపోయారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో నార్లు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలతో అనువైన వాతావరణం ఏర్పడడంతో జోరుగా వరి నాట్లు పడుతున్నాయి. దీంతో పల్లెల్లో ఎటు చూసినా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరో వైపు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదికి వరదలు రావటంతో ఆయకట్టు రైతులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లావ్యాప్తంగా 2.50 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాల్లో వరి, ఇతర పప్పు ధాన్యాలు, ఉద్యాన పంటలు మరో లక్ష ఎకరాల్లో పంటలు సాగుకావచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బోరు బావులున్న రైతులు వాటి కింద ఇప్పటికే వరినాట్లు వేశారు. చెరువుల కింద సేద్యం చేసే రైతులు నార్లు పోసి సిద్ధంగా ఉంచుకున్నారు. నెల రోజుల క్రితం పోసిన నారు నాటే దశకు చేరింది. దీంతో రైతులు నారు పీకించి వరినాట్లు వేయిస్తున్నారు. కాల్వల కింద నీటి విడుదల కావడంలో ఆలస్యం జరగడం వల్ల అలాంటి రైతులు ఇతర ప్రాంతాల నుంచి నారును కొనుగోలు చేసుకుని నాట్లు వేస్తున్నారు. జూన్ మొదటి వారంలో ఒక మోస్తరుగా వర్షం కురిసినా ఆ తర్వాత ముఖం చాటేయ్యడంతో రైతులు కలవర పడ్డారు. ఇప్పుడు పుష్కలంగా వర్షాలు కురవడంతో అనుకూల పరిస్థితులు ఏర్పడి నాట్లు ముమ్మరమయ్యాయి. వర్షాల రాక 25 రోజుల ఆలస్యం అయినందు వల్ల ఎక్కువ మంది రైతులు స్వల్పకాలిక రకం వరి వంగడాల వైపు మొగ్గు చూపుతున్నారు. కొందరు నాట్లు వేస్తుండగా మరికొంత మంది సమయం కలిసి రావడానికి పొల్లాల్లో విత్తనాలను నేరుగా జల్లుతున్నారు. ఆగస్టు మొదటి వారం వరకు నాట్లు వేసుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. బావుల కింద ఇప్పటికే నాట్లు వేసిన రైతులు ఇప్పుడు ఎరువులు చల్లుతున్నారు.



గ్రామాల్లో ముమ్మరంగా వ్యవసాయ పనులు

వర్షాల రాకతో గ్రామాల్లో ఖరీఫ్ వ్యవసాయ పనుల సందడి మొదలైంది. పనులు మొదలు కావడంతో పొలాలు దున్నే ట్రాక్టర్లకు, కూలీలకు డిమాండ్ పెరిగింది. కొవ్వూరు, నిడదవోలు, చాగల్లు మండలాల్లో 95 శాతం నాట్లు పూర్తయ్యాయి. అగస్టు ఐదో తేదీ నాటికి వరినాట్లు 100 శాతం పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరాకు రూ.2 వేల నుంచి రూ. 2500 వరకు నాట్లు వేసే కూలీలకు చెల్లిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చిన విషయం విదితమే. టమోటా కిలో రూ.100 దాటి రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయి. జిల్లాలో 35 వేల ఎకరాల్లో కూరగాయల పంట సాగవుతోంది. వర్షాలు అనుకూలంగా ఉండటం, ధరలు పెరగడంతో మెట్ట ప్రాంతాల్లో రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ ఏడాది కూరగాయల సాగు పెరిగే అవకాశాలు నెలకొన్నాయి.



క్యాటన్ బ్యారేజి వద్ద గోదావరి నీటిమట్టం

నెమ్మదించిన గోదావరి ఉధృతి

ధవళేశ్వరంలో 11.10 అడుగుల నీటిమట్టం
భద్రాచలం వద్ద తగ్గుముఖం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

గోదావరి నది నెమ్మదించింది. భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నిలకడగా కొనసాగుతోంది. సోమవారం నాటికి కాటన్ బ్యారేజీ వద్ద 11.10 అడుగులు, భద్రాచలం వద్ద 36.40 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో ఆదివారం అర్ధరాత్రే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. కాటన్ బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 8,96,657 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పంట కాలువలకు 11,700 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజీ నుంచి దిగువునకు జలాలను విడుదల చేయడంతో లంక గ్రామాలను వరద నీరు తాకింది. ప్రస్తుతానికి ప్రమాదం లేకున్నా మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని మించి ప్రవాహం ఉంటే లంక గ్రామాలు ముంపునకు గురవుతాయి. దీంతో లంక గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతమైన పి.గన్నవరంలో కనకాయిలంక కాజ్‌వే నీట మునిగింది. అక్కడ ప్రజలు ఇంకా పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కె.గంగవరం మండలం కోటిపల్లిలో లాంచీలరేవును పూర్తిగా మూసేశారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి, పెదపట్నం లంక మధ్య పాటరేవు ప్రాంతం నీటమునిగింది. పాశర్లపూడి కరకట్ట దిగువన కాజ్‌వేకు ఇరువైపులా వరద నీరు చేరింది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి వరదతో రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల వద్ద గోదావరి పెరగడంతో లంకల్లోకి రాకపోకలు స్తంభించాయి. లంకల్లో రైతులు బొప్పాయి పంటను వేశారు. రాకపోకలు లేకపోవడంతో పడవలపై బొప్పాయి పంటను తరలిస్తున్నారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో అన్ని రేవులు, స్నానఘట్టాల వద్ద బారికేడ్లు పెట్టి మూసేశారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నిరంతరం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న దష్ట్యా గోదావరికి పెద్ద ఎత్తున వరద నీరు చేరే అవకాశం ఉన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. సోమవారం క్షేత్ర స్థాయి అధికారులతో వరద పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు రోజులుగా 9 లక్షల క్యూసెక్కుల వరదనీరు చేరిందన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ, ఫైర్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. క్షేత్ర స్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఓలు ఇతర సమన్వయ శాఖలతో ఎప్పటి కప్పుడు సంప్రదించి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్న, తెగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి భద్రత చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రేపు సాయంత్రం నాటికి 10 లక్షల క్యూసెక్కుల చేరే అవకాశం ఉందని, పై ప్రాంతాల్లో వర్షాలు కురవకపోతే ఎటువంటి ఇబ్బందులూ ఉండవని అధికారులు తెలియ చేశారన్నారు. మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు.

రాజానగరంలో వెంకటరమణ పర్యటన

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం నియోజకవర్గంలో టిడిపిని బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకువస్తానని పార్టీ నియోజకవర్గం నూతన ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు సేకరించాక మొదటిసారిగా రాజానగరం మండలం తూర్పు గానుగూడెం శివాలయంలో మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో పార్టీ బలమైన కేడర్ ఉందన్నారు. గతంలో పార్టీలో కొంత అసంతృప్తి ఉందని, ఇప్పుడు లేదని అందరినీ కలుకుని నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకుని వస్తానని చెప్పావు. కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. పార్టీ నాయకులకు గంగిశెట్టి చంటిబాబు, కందుల సత్యవతి, కందుల రాయుడు, తనకాల నాగేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి కొల్లం రత్నం, వంకా మల్లిబాబు తదితరులు ఉన్నారు.



గోపాలపురంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపురం, గోకవరం

పేద విద్యార్థులకు విద్యను చేరువ చేసేందుకు అందుకు అవసరమైన మౌలిక వసతులు, అనేక పథకాలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని వేళ్లచింతలగూడెం సర్పంచ్ గోళ్ల దండియ అన్నారు. సోమవారం మండలంలోని వేళ్లచింతలగూడెం పరిధిలోని పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యా కానుక పుస్తకాలను గ్రామ సర్పంచ్ గోళ్ల దండియ, పాఠశాల దాత తాణింకి గంగరాజు విద్యార్థులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంలో అనేక నూతన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి మౌలిక వసతులు ఏర్పాటు చేశారని అన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే సాంకేత పరిజ్ఞానంతో కూడిన విద్యను, ఇంగ్లీష్ మీడియం విద్యను పేద విద్యార్థులకు చేరువ చేశారని అన్నారు. పేద విద్యార్థులు విద్యకు దూరం అవ్వకూడదనే ఉద్దేశంతో అవసరమయ్యే పథకాలు, ఉచిత బుక్స్, మధ్యాహ్నం భోజనం, అమ్మ ఒడి, విద్యా కానుక కిట్లు అనేక రకాలు పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించి ఆశలకు అనుగుణంగా కలలో సహకారం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సిరమయ్య, ఉపాధ్యాయులు సనపాల రాజశేఖర్, జగతా శ్రీను, సిఆర్‌పి నాగరాజు పాల్గొన్నారు. గోకవరం మండల కేంద్రంలో ఉర్దూ పాఠశాల విద్యార్థులకు సోమవారం సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని, విద్యార్థులుకు ఈ ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోలేటి రాంప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

చాగల్లు : నేలటూరు పరిధిలోని 3 చేపల చెరువులకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్టు ఇఒ.ఎల్ రవికుమార్ తెలిపారు. ఆసక్తి గలవారు షరతులు ధరావత్తు వివారాలను ముందుగా తెలుసుకొని వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామపంచాయితీ వద్ద వేలం నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యార్థి సంఘాల బంద్

గోపాలపురం : నేడు నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పులువురు విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్, టిఎన్‌ఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ బంద్ చేపట్టినట్టు తెలిపార. ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ యాజమాన్యాలకు బంద్ నోటీసులు అందించామన్నారు. ప్రభుత్వ రంగంలోనే నాణ్యమైన విద్యను అందించాలని, కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ అమ్మ ఒడి పథకాన్ని వేయాలని, ఎంఇపి 20ను రద్దు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, మెగా డిఎస్‌పి పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్లతో బంద్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.సునీల్, కె.సంతోష్, కె.శంకర్, సిహెచ్.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి

చాగల్లు : చంద్రవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి. కె.సుమన్ కుమార్, ఉపాధ్యాయులు ఎన్.రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ పితామహునిగా, అయ్యంకి వెంకటరమణయ్య చేసిన విశేష కృషిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు నిడదవోలు సత్యనారాయణ, కెఇస్సాక్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గ్రంథ పాలకుడు కె.సుమన్ కుమార్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడాలి

ప్రజాశక్తి -దేవరపల్లి, నిడదవోలు

మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలపై దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం దేవరపల్లి బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు మండల గౌరవాధ్యక్షురాలు టిపి.లక్ష్మి, మండల కార్యదర్శి ఎస్.భగత్, రైతు సంఘం నాయకులు ఉండవల్లి కష్ణారావు, పప్పు రామారావు మాట్లాడారు. సిఐటియు నాయకులు కె.రత్నాజీ, అయినపర్తి శ్రీనివాసరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లిపూడి వెంకటలక్ష్మి, రైతు సంఘం నాయకులు పిన్నమనేని సత్యనారాయణ, భవన నిర్మాణ సంఘం నాయకులు గ్యాలం సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్స్ నాయకులు సిరాబవి, కె.పద్మ, కామేశ్వరి, సిరా యూన్సీ, మడిల్లి రామారావు, పుల్లూరు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. నిడదవోలులో యుటిఎఫ్, సిఐటియు కెవిపిఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ మతం ముసుగులో హిందూ ఉన్మాదులు బిజెపి ప్రభుత్వం ప్రోత్సాహంతో ఈ దారుణాలకు పాల్పడుతున్నారన్నారు. యుటిఎఫ్ నాయకులు ప్రదీప్ మాట్లాడుతూ మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గంటి కృష్ణ, గుమ్మాపు డానియల్, యుటిఎఫ్ నాయకులు జి.ఆనంద మోహన్, జి.శివకుమార్ కెఎన్‌విపి కుమార్, కె.సత్యనారాయణ, జి.రమేష్ బాబు, రాజు, బి.శ్రీరామ్, లిల్లీ గ్రేస్, కాంతి, మున్నిసా బేగం, రాజేశ్వరి, శ్రావణి, గంగారత్నం, స్వరూప రాణి పాల్గొన్నారు.



నిడదవోలులో..



దేవరపల్లిలో..


అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనల వచ్చిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జె.నరసింహులతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాధవీలత మాట్లాడుతూ స్పందనలో నేడు 73 అర్జీలు స్వీకరించామని చెప్పారు. వీటిలో ఆన్‌లైన్ ద్వారా-66, ఆఫ్ లైన్ ద్వారా-7 ఉన్నాయన్నారు. ఇందులో అగ్రికల్చర్, వైద్యఆరోగ్యం, సాంఘిక సంక్షేమ శాఖలకు సంబంధించి ఒక్కోక్కటి, విద్యుత్, ఇరిగేషన్ రెండు చొప్పున, హౌసింగ్ 3, హోమ్ 15, రెవెన్యూ 32, పంచాయితీరాజ్ 9 వచ్చాయన్నారు. అర్జీల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయి ఆయా గ్రామాలు, వార్డుల్లో విచారణకు వెళ్లేటపుడు పిటిషన్ దారులకు సంబంధిత సమాచారం ఇవ్వాలన్నారు. విచారణ సందర్భంగా పిటిషన్ దారులు కూడా అందులో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలన్నారు. పిటిషన్‌దారు ఇచ్చిన వినతి పరిష్కారంకోసం ఆయా ప్రభుత్వ శాఖ చేపట్టిన చర్యలపై పూర్తి సమాచారం అందించడం ద్వారా వారిలో తన సమస్య పరిష్కారం అవుతుందన్న విశ్వాసం కల్పించాలన్నారు. ప్రజల నుంచి జేకేసీ ద్వారా వచ్చే అర్జీలకు సంబందించి పరిష్కారంలో సంబందిత శాఖలు సకాలంలో స్పందిస్తూ వెనువెంటనే పరిష్కరించాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే విధంగా ఆయా ప్రభుత్వ శాఖలు చర్యలు చేపట్టిన తర్వాత మాత్రమే సంబంధిత చర్యలను ఆన్‌లైన్ లో అప్‌లోడ్ చేసి పరిష్కరించినట్టు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, పర్యాటక శాఖ డియంహెచ్ఒ డాక్టర్ కె.వేంకటేశ్వరరావు, సిపిఒ ఎ.ముఖలింగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. మాధవరావు, డిటిఒ ఎన్.సత్యనారాయణ, డిఇఒ ఎస్ అబ్రహాం పాల్గొన్నారు.



అర్జీలు స్వీరిస్తున్న కలెక్టర్



కార్టూ'నిజం'

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ప్రజాశక్తి-తాళ్లపూడి, చాగల్లు

ప్రజల అవసరాలను వెంటనే తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అన్నారు. మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో సోమవారం జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రజలకు వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గంగాభవాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎఎంసి ఛైర్మన్ వల్లభ శెట్టి శ్రీనివాస్, వైసిపి నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పోసిన శ్రీకష్ణదేవరాయలు, ఎంపిడిఒ వెంకటరమణ, డిప్యూటీ తాసిల్దార్ అహ్మద్ పాల్గొన్నారు. చాగల్లు-5 గ్రామ సచివాలయం, ఊనగట్ల సచివాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. చాగల్లు-5 సచివాలయంలో 878, ఊనగట్ల సచివాలయంలో 980 సర్టిఫికెట్స్ చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఊనట్లలో సర్పంచ్ మట్ట వెంకట్రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బొలిశెట్టి రాంప్రసాద్, చాగల్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, ఊనగట్ల పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ పాల్గొన్నారు.



తాళ్లపూడిలో..

ఇమ్యునైజేషన్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

క్లిష్ట పరిస్థితుల్లో, రవాణా సౌకర్యం లేని ప్రాంతాలో సైతం మనం ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు టీకాలు వేస్తూ ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని జిల్లా కలెక్టరు డా. కే.మాధవీత పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 'ఆరోగ్య మిషన్' ఇంద్రధనస్సు 5.0 ప్రత్యేక ఇమ్మునైజేషన్ కార్యాక్రమం పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ తేజభరత్‌తో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో వారం రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చెయ్యాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే క్రమం తప్పక ప్రతి పిహెచ్‌సిలో ప్రతి బుధవారం, శనివారం టీకా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటికి అనుసంధానంగా జిల్లాలోని ఏ ఒక్కరూ మిగలకుండా అందరికీ టీకాలు వేయడం ముఖ్యం అన్నారు. ప్రతి ఒక్కరికీ వివిధ వ్యాధులు నిర్మూలనకు అవసరమయ్యే టీకాలను అందించేందుకు ప్రత్యేక టీకా కార్యక్రమాలను పైన తెలిపిన తేదీల్లో ప్రతి గ్రామ, పట్టణ కేంద్రాల్లోని పిహెచ్ సీలు, సచివాలయాల్లో నిర్వహిస్తారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి, డిఆర్ఒ జి.నరసింహులు, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిఐఒ రాజకుమారి, డిసిహెచ్ఒ ఎన్.సనత్ కుమారి, డిపిహెచ్ ఎం.వసంతలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



బాలుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లి మండలం కోనపాపేట తీరంలో సముద్ర స్నానానికి దిగి గల్లంతైన బాలుని మృతదేహం సోమవారం ఉదయం కోనపాపపేట తీరంలో లభ్యమైంది. సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన కొంత మంది ఆదివారం లోవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోనపాపేట వద్ద సముద్రంలో స్నానానికి వెళ్లారు. అలల ఉధృతి అధికంగా ఉండడంతో పసుపులేటి పార్ధు(9) గల్లంతయ్యాడు. బాలుని మృతదేహం కోనపాపేట తీరంలో ఒక హ్యాచరీ సమీపాన సముద్ర ఒడ్డుకు చేరింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సినిమా సెంటర్‌లో ఒక హోటల్‌లో సోమవారం రాత్రి గ్యాస్ బండ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో హుటాహుటిని అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్యాస్ మంటలను ఆర్పి వేశారు. వెంటనే మంటలను ఆర్పి వేయడం వల్ల ఎలాంటి నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాలలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ఎనిమిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని సామర్లకోట సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్ఐ చిత్రాడ గోపాలకృష్ణ సిబ్బందితో ఆదివారం రాత్రి ఈ తనిఖీలు చేపట్టారన్నారు. సామర్లకోటకు చెందిన ఎం.హరిబాబు, ప్రదీప్ యాదవ్, ఎం.గోవింద్, పెద్దాపురానికి చెందిన కొర్రిపూరి శ్రీనివాస్,మహేంద్ర శ్యామ్ కిషోర్, రామచంద్రపురానికి చెందిన పువ్వుల ప్రసాద్, జొన్నాడకు చెందిన బందరు దుర్గారావు, ఆర్‌బి.కొత్తూరుకు చెందిన కర్ర సీత రాంబాబులను పరీక్షలు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా సహకరించాలని సిఐ దుర్గాప్రసాద్ కోరారు.

క్లీనర్ మృతిపై డ్రైవర్ పిర్యాదు

ప్రజాశక్తి - అలమూరు

క్లీనర్ మృతి చెందడంతో డ్రైవర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు యెనుగుదాటి సోమేశ్వర ప్రసాద్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భీమవరానికి చెందిన జి.లక్ష్మణరావు క్లీనర్‌గా ఉన్నాడు. ఈ నెల 23న క్లీనర్‌తో కలిసి వరప్రసాద్ రాజమహేంద్రవరం నుంచి లారీలో పెదపల్ల రైస్ మిల్‌కు రైస్ బ్యాగ్స్ లోడ్ కోసం వచ్చారు. లారీకి టార్పాలిన్‌లను ఉదయం కలిసి కడుతున్నారు. లారీపైన ఉన్న క్లీనర్ లక్ష్మణరావు(45) లారీపైనే కూర్చొని ఆకస్మికంగా మరణం పొందాడు. ఈ మేరకు డ్రైవర్ వరప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



కాలని బ్రౌన్ పేట సెంటర్‌కు చెందిన 12 ఏళ్ల బాలిక అదృశ్యంపై సోమవారం రాత్రి సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సామర్లకోటకు చెందిన గంట గంగాభవాని(12) గణేష్ కాలనీలో షాపు వద్దకు వెళ్లి అనంతరం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఎంతకీ ఆచూకీ దొరక్కపోవడంతో పాప తండ్రి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తోట సునీత తెలిపారు. నీలం రంగు డ్రెస్, ఆరెంజ్ కలర్ చున్నీ ధరించిందని తెలిపారు. సరిగా మాట్లాడలేదని, అప్పుడప్పుడు ఫిట్స్ కూడా వస్తాయని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో గాని లేదా 9440796568, 9701626505 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నాం. పాపం కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

బిలియర్డ్స్ టోర్నీ విజేత పాండురంగయ్య

ప్రజాశక్తి - కాకినాడ

భారతం లక్ష్మీపతి సోమయాజులు మెమోరియల్ దక్షిణ భారత బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ చాంపియన్ షిప్-2023 విజేతగా రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ సభ్యులు ఇ.పాండురంగయ్య(నెల్లూరు) నిలిచారు. తెలంగాణాకు చెందిన బ్రాండెన్ రన్నరగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అర్జున అవార్డ్ గ్రహీత వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్ షిప్‌వ ఇజేత అశోక్ శాండిల్య హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలను అందించారు. ఆయన మాట్లాడుతూ బిలియర్డ్స్ స్నూకర్స్ పోటీల నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేశారు. విన్నర్, రన్నర్‌తోపాటూ హైయెస్ట్ స్కోర్ చేసిన క్వాటర్ ఫైనలిస్టు కె.విభాస్ (తెలంగాణా), దిలీప కుమార్(ఆర్ఎస్‌పిబి), నరేష్ జెర్స్(తెలంగాణా), రఫత్ హబీబ్(తమిళనాడు), సెమీఫైనలిస్టులు కె.గిరీష్(ఆర్ఎస్‌పిబి), ఎ.అరవింద్: (ఆర్ ఎస్ పి బి)లకు బహుమతులు అందించారు. అతిపెద్ద ట్రోఫీని ప్రత్యేకించి తయారుచేయించిన హరీష్ స్పోర్ట్స్ అధినేత హరీష్ అందజేసిన ట్రోఫీని విజేత పాండురంగయ్యకు అందించాచరు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, డాక్టర్ యాతగిరి పరశురామ్, టౌన్ హాల్ కమిటీ అధ్యక్షులు నానాజి, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, కాస్మోపాలిటిన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌విఎస్.రావు, టోర్నమెంట్ మేనేజింగ్ కమిటీ లిటరరీ అసోసియేషన్ అధ్యక్షులు జి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు జివి, రఘునాథ్, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, కాస్మోపాలిటన్ క్లబ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్‌విఎస్.రావ్య తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకుంటున్న పాండురంగయ్య



కమిషనర్‌కు మొక్కను బహూకరిస్తున్న డిఎఫ్ఒ భరణి

కమిషనర్‌ను కలిసిన డిఎఫ్ఒ భరణి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.భరణి సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె గతంలో రంపచోడవరం సబ్ డిఎఫ్ఒగా పనిచేశారు. బదిలీపై ఇక్కడకు వచ్చారు. కమిషనర్‌కు మొక్కను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

జ్యుడీషియల్ విచారణ చేయాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కిర్లంపూడి మండలం గోనేడలో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని హత్య కేసుపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించాలని, నిందితులను కఠినంగా శిక్షించి, వారికి సహకరిస్తున్న కిర్లంపూడి పోలీస్ అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య, బిసి, ఎస్‌సి సంఘాల నాయకులు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు సుందరపల్లి వివిఎస్.గోపాలకృష్ణ మాట్లాడారు. గోనేడకు చెందిన విద్యార్థిని జగ్గంపేట అక్షర కాలేజీ నుంచి కాలేజీ బస్సులో ఇంటికి వచ్చే సమయంలో సెల్‌ఫోన్ చోరీకి గురైందని చెప్పి అతని స్నేహితులే బలవంతంగా తీసుకెళ్లారన్నారు. అనంతరం విద్యార్థి అపస్మారక స్థితిలో యానాం గోదావరి ఒడ్డున పడిఉన్నాడన్నారు. జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వైద్యం పొందుతూ మృతి చెందాడన్నారు. దీనిపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెళ్ళగా, నిందితులకు వత్తాసు పలుకుతూ స్టేషన్ ఎస్ఐ ఫిర్యాదు తీసుకోకుండా జాప్యం చేశారన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని, నిందితులకు సహకరిస్తున్న పోలీసు అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు పప్పు దుర్గారమేష్, గుత్తుల రమణ, చొల్లంగి వేణుగోపాల్, దళిత నాయకులు జగడం సత్యనారాయణ, మెలిపాక నాగబాబు, వి.నాని, ఎం.విష్ణు, మహేష్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



స్పందనకు వచ్చిన బిసి, ఎస్‌సి సంఘాల నాయకులు, మృతుని కుటుంబ సభ్యులు

యానాం వార్తలు

ఒఎన్‌జిసి పరిహారంపై సర్వే పూర్తి

ప్రజాశక్తి - యానాం

ఒఎన్‌జిసి సంస్థ మత్స్యకారులకు 2022 - 23 సంవత్సరానికి ఇచ్చే నష్టపరిహారానికి సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం, మత్స్యశాఖ విలేజ్ లెవెల్ కమిటీ నిర్వహించిన సర్వే పూర్తి అయ్యిందని మత్స్యశాఖ సహాయ సంచాలకులు డి.గొంతియ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ సర్వే నిర్వహించారన్నారు. అర్హులైన మత్స్యకారుల జాబితాను యానాం గవర్నమెంట్ వెబ్‌సైట్, మత్స్యకార గ్రామ కమ్యూనిటీహాలు, మత్స్య శాఖ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 2లోపు సరైన ఆధారాలతో మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



గోతిని పూడ్చండి సారూ...

యానాం నల్లచెరువు కాలవతూము వద్ద పైపులైన్ మరమ్మత్తు పనుల కోసం ఇటీవల రోడ్డు మధ్యన గోతిని తవ్వారు. పని పూర్తయినా నేటికీ గోతిని మాత్రం పూడ్చలేదు. మలుపు వద్ద గొయ్యి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రోజూ ఇటుగా వస్తున్నా గోతిని మాత్రం పట్టించుకోవట్లేదని వాపోయారు.

ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

యానాం ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జనరల్ బాడీ సమావేశం పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వర్తక సంఘం అధ్యక్షులు నల్లా వెంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా జెమినీ స్టూడియో అధినేత ఎస్.అహ్మద్ ఎంపికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా జె.లోవరాజు, సెక్రటరీగా పెనుగొండ దుర్గబాబు, ట్రెజరర్‌గా మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె.రహీమ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా నల్ల వెంకన్న, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్, జిల్లా పరిషత్ సెంటర్ వద్ద వర్షంలో తడుస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ నాయకులు తాటిపాక మధు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఉన్న వారందరూ సామాన్య, మధ్యతరగతి ప్రజలేనన్నారు. కాయ కష్టం చేసి దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఇచ్చి ఎన్నికల్లో గద్దెనెక్కి నాలుగేళ్లయినా నేటికీ న్యాయం చేయలేదన్నారు. 024 ఎన్నికల్లోపు అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ రూపంలో ఉన్న సొమ్మును చెల్లించాలని లేకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ ధర్నాలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, యూనియన్ నాయకులు బాలరాజు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వై.నాగలక్ష్మి, వీరమణి, బొమ్మేటి రాంబాబు, కొల్లు శ్రీనివాస్, వైకె.రాజు, శేఖర్, అర్జున్‌రావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో యశ్వంత్‌కి సిల్వర్ మెడల్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జెఎన్‌టియుకెలో నేషనల్ యోగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగా పోటీల్లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి కిలాడి యశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం తెలిపారు. వచ్చే నెలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్ల యశ్వంత్ పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థి యశ్వంత్, వ్యాయామ ఉపాధ్యాయులు వైకుంఠంను మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ జాన్‌మోజేష్, పిఎంసి చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, కమిషనర్ జె.రామారావు, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తదితరులు అభినందించారు.

సిఎంను కలిసిన దొరబాబు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన సిఎం జగన్‌ను ఎపీ స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు కలిశారు. హెలీకాప్టర్‌లో కృష్ణాయపాలెం వద్దకు చేరుకున్న సిఎంకు దొరబాబు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సిఆర్‌డిఎ పరిధిలో ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇడబ్ల్యూఎస్ లే-అవుట్లలో రూ.1,829.57 కోట్లతో చేపట్టనున్న 50,793 ఇళ్ల నిర్మాణానికి, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో దొరబాబు పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణానికి సిఎం జగన్ పూనుకోవడం హర్షణీయమన్నారు.

నిర్లక్ష్యాన్ని వీడాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలో అచ్చంపేట- గొంచాల గ్రామాల మధ్యలో నిర్మించిన హైవే రహదారికి అప్రోచ్ రోడ్డు నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, ఫలింగా ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మరణించారని, ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరోజా వాసు, పిట్టా జానకిరామారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో యువశక్తి నిర్వీర్యం

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో యువశక్తి నిర్వీర్యమవుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారన్నారు. నాలుగేళ్లల రూ.11 లక్షల అప్పు చేసి ప్రజలపై పెనుభారాన్ని మోపారన్నారు. ప్రస్తుతానికి మినీ మేనిఫెస్టోను పార్టీ విడుదల చేసిందన్నారు. ఎన్నికల సమయంలో మరో మేనిఫెస్టోను సిద్ధం చేశామన్నారు. ప్రజలందరూ అభివృద్ధి చెందేలా మేనిఫెస్టో ఉంటుందన్నారు. టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రచార ఆర్గనైజర్ యనమల కృష్ణుడు, టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ స్పందనకు 12 అర్జీలు

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని ఆర్‌డిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

'పేదల ఆకలిని గుర్తించింది టిడిపియే'

ప్రజాశక్తి - జగ్గంపేట

పేదల ఆకలిని గుర్తించిన పార్టీ టిడిపియేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ రోడ్‌లో గల ఎన్‌టిఆర్ స్మారకమందిరం కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కిర్లంపూడి మండల టిడిపి నాయకులు తూము కుమార్ ఆర్థిక సాయంతో భోజనాలను ఏర్పాటు చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతుల ప్రారంభించి మాట్లాడారు. పేదల కోసం టిడిపి ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు జగ్గంపేటలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బోండా రాజేష్, టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి.కాజా, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులకు కష్టాలు

ప్రజాశక్తి - జగ్గంపేట



నీటితో నిండిపోయిన సర్వీసు రోడ్డు

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేటలోని తుని వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోంది. పలుమార్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న రహదారి కింద భాగాన డ్రెయినేజీ మట్టితో పూడుకుపోయింది. దీంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. మోకాళ్ళ లోతుకుపైగా 100 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు పొడవునా నీరు ఉండిపోవడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే సమస్య ఉన్నా హైవే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా స్పందించట్లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరం పాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో హెచ్ అండ్ బిఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డి. శ్రీనివాసరావుకు 'ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రసాదించిందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ ఆర్.డేవిడ్‌కుమార్ నేతృత్వంలో శ్రీనివాసరావు సమర్పించిన 'స్టడీ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆఫ్ సమ్ నాన్ - న్యూటోనియన్ ఫ్లూయిడ్స్' అనే సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించిందన్నారు. శ్రీనివాసరావు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి బిఎస్ఎన్.మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి..వేణుగోపాల్ తదితరులు అభినందనలు తెలిపారు.

గొల్లలగుంటలో సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గొల్లలగుంటలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె భవనాలను ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో జగనన్న సురక్ష సభను ఎంపిడిఒ వసంతకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం వైసిపి సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఒమ్మి రఘురాం మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు చిత్తశుద్ధితో అభివద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో పాత ప్లాస్టిక్ గోనె సంచుల కంపెనీలో తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, జీతాల బకాయిలు చెల్లించాలని ఐఎఫ్‌టియు అధ్యక్షులు ఎం.ఏసు డిమాండ్ చేశారు. జగ్గంపేటలోని స్టాలిన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. స్థానికులను తొలగించి ఒడిశా వాసులను పనిలో పెట్టుకోవడం సరికాదన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామనానరు. అధికారులను కలిసి చట్టపరమైన పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.లక్ష్మి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు జి.బాలరాజు, దాసరి రత్నం, కొట్టెడ అమ్మాజీ, సత్యవరపు వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

కాకినాడరూరల్ : జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న మంగళవారం మణిపూర్ సంఘటనలపై శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవుల పెద్దలు జోసెఫ్ బెన్నీ, శామ్యూల్, సాగర్, రిక్కీ గూటం తెలిపారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట వైద్యనగర్ ఫ్రెండ్స్ కాలనీలో గల బెరాక బ్లెస్సింగ్ చర్చిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాంతి ర్యాలీ వివరాలను వెల్లడించారు. మణిపూర్ హింసలో 249 చర్చిలను కూల్చేశారన్నారు. స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాలకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటిని నిరసిస్తూ శాంతి ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు.భానుగుడి జంక్షన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు.